
పోలింగ్ సిబ్బంది మూడో దశ ర్యాండమైజేషన్ పూర్తి 10వ

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం 10వ



ప్రచారానికి తెర.. ప్రలోభాల ఎర

- అంతు చిక్కని ఓటరు నాడీ
- ట్రెండ్ గురించి పార్టీ నేతలతో అభ్యర్థుల ఆరా

(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ పరిధిలో ఎన్నికల ప్రచారానికి తెర పడింది. ఓటర్లు స్తబ్దంగా ఉండడంతో వారి నాడీ అంతు చిక్కడం లేదు. వారిని తమ వైపునకు తిప్పుకునేందుకు పలువురు అభ్యర్థులు ప్రలోభాలతో ఎర వేస్తున్నట్లు తెలుస్తున్నది. ట్రెండ్ ఎక్కడ ఎలా ఉంది అని ఎప్పటికప్పుడు అభ్యర్థులు, పార్టీల నాయకులతో తెలుసుకుంటూ అప్రమత్తం అవుతున్నారు. ఈ నెల 13వ తేదీన ఉదయం ఏడు గంటల నుంచి పోలింగ్ ప్రారంభం కానున్నది. పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి నియోజకవర్గాల్లో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం ఆరు గంటల వరకు పోలింగ్ జరగనుండగా, మంథని, మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూరు నియోజకవర్గాల్లో ఉదయం ఏడు గంటల నుంచి సాయంత్రం నాలుగు గంటల వరకు పోలింగ్ జరగనున్నది. మంచిర్యాల, బెల్లంపల్లి, చెన్నూర్, మంథని నియోజకవర్గాలు సమస్యాత్మక నియోజకవర్గాలు కావడంతో అక్కడ పోలింగ్ సమయాన్ని తగ్గించారు. మిగతా నియోజకవర్గాల్లో ఎండలు దంచి కొడుతుండడంతో అదనంగా ఒక గంట సమయాన్ని ఆరు గంటల వరకు పెంచారు. ప్రధాన పార్టీలైన బీఆర్ఎస్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్, కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసే తదితరులు విస్తృతంగా ప్రచారం చేశారు. తమ పార్టీలు చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించడంతో పాటు తాము గెలిస్తే ఈ ప్రాంతంలో నెలకొన్న సమస్యలను పరిష్కరిస్తామని చెబుతున్నారు. పార్టీల నాయకులు, కార్యకర్తలు ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి ప్రచారం చేశారు. అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా ఉన్నంత జోష్ పార్టీ నాయకులు, కార్యకర్తల్లో కనబడలేదు. ఓటర్లు కూడా స్తబ్ధంగా ఉన్నారు. అభ్యర్థులు, పార్టీల నాయకులతో ఎప్పటికప్పుడు గెలుపోటముల గురించి చర్చిస్తూ ఉన్నారు. ఎక్కడ బలంగా ఉన్నాం, ఎక్కడ బలహీనంగా ఉన్నామనే విషయమై ఆరా తీస్తు అందుకు అనుగుణంగా చర్యలు తీసుకుంటున్నారు. బలహీనంగా ఉన్న చోట పోల్ మేనేజ్‌మెంట్‌తో పాటు మద్యం పంపిణీ చేసేందుకు రంగం సిద్ధం చేసుకున్నట్లు సమాచారం. బూత్ స్థాయిలో బలంగా ప్రచారం చేసేందుకు క్యాడర్‌ను అప్రమత్తం చేస్తున్నారు. ప్రలోభాలను అరికట్టేందుకు అధికారులు ఒకవైపు పోలింగ్ ఏర్పాట్లు చేస్తుండడంతో పాటు పార్టీల అభ్యర్థులపై నిఘా పెట్టారు.

ఓటు వేసేందుకు ప్రత్యామ్నాయంగా 12 గుర్తింపు కార్డులు

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ఓటరు గుర్తింపు కార్డు (ఎపిక్ కార్డు) లేకుంటే 12 రకాల ప్రత్యామ్నాయ ఫొటో గుర్తింపు కార్డులలో ఏదో ఒకదానిని చూ పెట్టి తమ ఓటు హక్కును వినియోగించుకునే అవకాశం ఎలక్షన్ కమిషన్ కల్పించిందని పెద్దపల్లి పార్లమెంట్ రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎపిక్ కార్డు లేని వాళ్లు ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, బ్యాంకు, పోస్ట్ ఆఫీస్ జారీ చేసిన పాస్ పుస్తకాలు, కార్మిక మంత్రిత్వ శాఖ జారీ చేసిన ఆరోగ్య బీమా స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, ఎన్‌పీఆర్ కింద ఆర్‌జీఐ జారీ చేసిన స్మార్ట్ కార్డు, పాస్‌పోర్ట్, ఫొటోతో కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, పీఎస్‌యూలు, పబ్లిక్ లిమిటెడ్ సంస్థల ఉద్యోగులకు ఫొటోతో జారీ చేసిన ఐడీ కార్డు, ఎంపీ, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసిన ఐడీ కార్డు, ప్రత్యేక వైకల్యం ఐడీ కార్డు (యుడీఐడీ)లలో ఏదో ఒకదానితో ఓటు వేయవచ్చని తెలిపారు. అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును ఎన్ని పనులు ఉన్నా పోలింగ్ రోజు మే 13న సమయం కేటాయించి తమ ఓటు హ క్కును తప్పనిసరిగా వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.

ముగిసిన ఎప్‌సెట్



హాల్‌టికెట్లను పరిశీలిస్తున్న సిబ్బంది

రామగిరి, మే 11: మంథని జేఎన్టీయూ ఇంజనీరింగ్ కళాశాలలో ఐదు రోజులుగా కొనసాగుతున్న తెలంగాణ రాష్ట్ర ఇంజనీరింగ్, అగ్రికల్చర్, ఫార్మసీ ప్రవేశ పరీక్షలు (ఎప్‌సెట్) శనివారం ప్రశాంతంగా ముగిసాయి. ఉదయం 95 మంది విద్యార్థులకు గాను 94 మంది హాజరయ్యారు. మూడు రోజుల పాటు జరిగిన ఇంజనీరింగ్ విభాగంలో 540 మందికి గాను 89 శాతంతో 483 మంది విద్యార్థులు పరీక్షకు హాజరైనట్లు ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి తెలిపారు. రెండు రోజుల పాటు జరిగిన అగ్రికల్చర్, ఫార్మసీ విభాగంలో 285 మందికి గాను 98 శాతంతో 275 మంది విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. పోలీసుల పర్యవేక్షణలో పరీక్షలు ప్రశాంతంగా ముగిసాయి.

అవకాశాలకు తగ్గట్లుగా
విద్యార్థులు నైపుణ్యం పెంచుకోవాలి

పెద్దపల్లి రూరల్, మే 11: భవిష్యత్‌లు వస్తున్న అవకాశాలకు తగ్గట్లుగా నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని మదర్‌థెరిస్సా ఇంజనీరింగ్ కళాశాల డైరెక్టర్ నవత అన్నారు. శనివారం కళాశాలలో కంప్యూటర్ సైన్స్ విభాగం ఆధ్వర్యంలో టెక్ టాంగో స్పిరిట్ ఆఫ్ ఇంజనీరింగ్ అనే ఈవెంట్‌ను నిర్వహించారు. ఈసందర్భంగా కార్యక్రమానికి ముఖ్య అతిధిగా కళాశాల డైరెక్టర్ నవత హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు.

ఈ సందర్భంగా నవత మాట్లాడుతూ ఫైనల్ ఇయర్ విద్యార్థులు ఎంతో ప్రతిభ కనబర్చి వివిద ఎంఎన్‌సీ కంపనీలలో ఎంపిక కావడం హర్షించదగ్గ విషయమన్నారు. అనంతరం విద్యార్థులు చేసిన నృత్యాలు అలరించాయి. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, కంప్యూటర్ సైన్స్ ఇంజనీరింగ్‌విభాగాధిపతి బూర్ల శ్రీనివాస్, ఏవో పవన్, రమేష్, వంశీ, షబానా బేగం, శ్రీధర్, శశికాంత్, సవిత, రేణుక, కిషోర్, హిమబిందు, స్వాతి, రాకేష్, నవ్య, ఫాతిమా, తిరుమల, చంద్రమౌళితో పాటు విద్యార్థులు పాల్గొన్నారు.

పరిశ్రమలు నెలకొల్పుతా... ఉపాధి కల్పిస్తా..

గనులపై కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ ప్రచారం



గనిలో పనిచేస్తున్న ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ, ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

గోదావరిఖని, మే 11: పరిశ్రమలు నెలకొల్పి స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానని పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ తెలిపారు. రామగుండం అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలోని బొగ్గు గనులు, జీఎం కార్యాలయాల్లో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ శనివారం ప్రచారం నిర్వహించారు. ఆర్‌జీ-1 పరిధిలోని వర్క్‌షాప్, జీడీకే 2ఇంక్లైన్‌లో వంశీకృష్ణ ప్రచారం నిర్వహించారు. సింగరేణిగుర్తింపు సంఘం ఏఐటీయూసీ అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య ప్రచారంలో పాల్గొన్నారు. స్థానిక జీడీకే 2ఇంక్లైన్ వద్ద కార్మికులనుద్దేశించి గడ్డం వంశీకృష్ణ మాట్లాడుతూ ప్రజాసేవ చేస్తానని, ప్రజలు తనపై పెట్టుకున్న నమ్మకాన్ని నిలబెట్టుకుంటానన్నారు. ఇక్కడ పరిశ్రమలు నెలకొల్పి స్థానిక నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ మాట్లాడుతూ న్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపిస్తే సింగరేణి కార్మికులకు ఆదాయ పన్ను రద్దుతో పాటు 200గజాల ఇళ్లస్థలాలు కూడా ఇప్పిస్తామన్నారు. ఏఐటీయూసీ అధ్యక్షుడు సీతారామయ్య మాట్లాడుతూ పరిశ్రమలు కాపాడుకోవాలంటే ఈ ఎన్నికల్లో బీజేపీని ఓడించాలని, ఇండియా కూటమి అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

- అర్హులందరికీ అభివృద్ధి పథకాలు అందిస్తాం..

మంథని: అర్హులైన ప్రతి ఒక్కరి ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి పథకాలు అందే విధంగా కృషి చేస్తామని రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్‌బాబు వెల్లడించారు. పార్లమెంట్ ఎన్నికల ప్రచారంలో భాగంగా స్థానిక అంబేద్కర్‌చౌక్‌లో పెద్దపల్లి కాంగ్రెస్ పార్టీ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణతో కలిసి శనివారం మంత్రి శ్రీధర్‌బాబు కార్నర్ మీటింగ్‌లో నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల కోడ్ ముగియగానే గత ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేస్తామన్నారు.. గడ్డం వంశీ మాట్లాడుతూ.. నియోజకవర్గ అభివృద్ధితోపాటు ప్రజాసంక్షేమం కోసం పాటు పడుతానని ఎంపీగా తనకు అవకాశం కల్పించాలని కోరారు. అనంతరం పట్టణంలోని వివిధ సామాజిక వర్గాలకు చెందిన వారు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మున్సిపల్‌చైర్‌పర్సన్ పెండ్రి రమ-సురేష్‌రెడ్డి, ఎంపీపీ కొండ శంకర్, కాంగ్రెస్ నేతలు శశిభూషణ్‌కాచే పాల్గొన్నారు.

యశోద మెడికల్ సెంటర్

యశోద హాస్పిటల్స్

3-1-397/ఎ, హెచ్.డి.ఎఫ్.సి బ్యాంక్ ప్రక్కన, అంబేడ్కర్ రోడ్, కరీంనగర్

సూపర్ స్పెషాలిటీ వైద్యనిపుణులు మీ చేరువలో

ప్రత్యేకతలు	వైద్యులు	తేది
మెదడు, వెన్నెముక వ్యాధులు : తలనొప్పి, పక్షవాతం, మూర్ఛవ్యాధి, పార్కిన్సన్స్, వెన్ను మరియు మెడనొప్పి, చేతుల, కాళ్ళ తిమ్మిర్లు, నరాల బలహీనత	డా॥ మోహన్ కృష్ణ జొన్నలగడ్డ MBBS, MD (Internal Medicine), DM (Neurology)	14-05-2024 2వ మంగళవారం ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 4 గం॥ వరకు
కిడ్నీ వ్యాధులు : కిడ్నీ ట్రాన్స్‌ప్లాంటేషన్, రోబోటిక్ సర్జరీ, రీకన్‌స్ట్రక్టివ్ యూరాలజీ, ల్యాప్రొస్కోపిక్ యూరాలజీ, ఆండ్రాలజీ & మేల్ ఇన్‌ఫెర్టిలిటీ, మేల్ ఇన్‌ఫెర్టిలిటీ, ఫిమేల్ యూరాలజీ	డా॥ దుర్గ ప్రసాద్ బి MS (PGI Chandigarh), Mch (Urology, PGI Chandigarh)	
బ్లడ్ క్యాన్సర్ & రక్త వ్యాధులు: అన్ని రకాల రక్త సంబంధిత వ్యాధులు, బ్లడ్ క్యాన్సర్, లుకేమియా, లింఫోమా మరియు బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్	డా॥ శివ కుమార్ కె MBBS, DNB (Gen Medicine), DNB (Hematology)	
ఊపిరితిత్తుల వ్యాధుల కన్సల్టేషన్: దీర్ఘకాలిక దగ్గు, శ్వాసలో గురక, శ్వాస తీసుకోవటంలో కష్టం, టిబి (క్షయ), ఊపిరితిత్తులలో ఇన్ఫెక్షన్, ఆస్తమా ఊపిరితిత్తుల క్యాన్సర్	డా॥ విశ్వేశ్వరన్ బి. MD, DNB, DM (Pulmonary & Critical Care)	15-05-2024 3వ బుధవారం ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 4 గం॥ వరకు
గుండె వ్యాధులు : పుట్టుకతో గుండెలో రంధ్రములు, కవాటాలు, రక్తనాళాలకు బైపాస్ ఆపరేషన్‌లు, ECG, 2D ECHO సౌకర్యము కలదు	డా॥ కిరణ్ తేజ వరిగొండ MBBS, MD (General Medicine) DM (Cardiology)	
హెమటో ఆంకాలజి వ్యాధులు : ప్లేట్‌లెట్స్ సంఖ్య తగ్గడం / పెరగడం, బ్లడ్ క్యాన్సర్, లుకేమియా, లింఫోమా, మైలోమా,రక్తహీనత, అన్ని రకాల రక్త సంబంధిత వ్యాధులు, బోన్ మ్యారో ట్రాన్స్‌ప్లాంటేషన్	డా॥ మాధవ్ దంతాల MD, DM (Medical Oncology, NIMS)	
కందరాలు, కీళ్ళ నొప్పుల వ్యాధులు : కండరాల నొప్పులు, కీళ్ళవాపులు, ఆటోఇమ్యూన్, అన్నిరకముల ఎముకల వ్యాధులు	డా॥ ఐ. రాజేంద్ర వరప్రసాద్ MD, DM Rheumatology, APLAR Fellow, Former Associate Professor in Rheumatology, NIMS	16-05-2024 3వ గురువారం ఉదయం 10 గం॥ నుండి మధ్యాహ్నం 4 గం॥ వరకు
కిడ్నీ వ్యాధులు : మూత్రపిండాలలో రాళ్ళు, మంట, మూత్ర విసర్జనలో సమస్యలు, అధిక రక్తపోటు, షుగర్ వ్యాధిగ్రస్తులలో మూత్రపిండాల సమస్యలు	డా॥ దిలీప్ యం. బాబు MD, DM (Nephrology)	
గ్యాస్ట్రో వ్యాధులు : దీర్ఘకాలిక జీర్ణకోశ సంబంధిత సమస్యలు, కాలేయ సమస్యలు - కామెర్లు, లివర్ గడ్డలు, పిత్తాశయం, పిత్తనాళంలో రాళ్ళు, క్లోమ గ్రంథి - రాళ్ళు పాంక్రియాస్ కాన్సర్, పేగుపూత, రెక్టమ్ కాన్సర్	డా॥ మూడే జయంత్ MBBS, MS, DrNB (Surgical Gastroenterology) FIAGES, FALS (Robotic Surgery)	17-05-2024 3వ శుక్రవారం ఉదయం 10 గం॥ నుండి సాయంత్రం 4 గం॥ వరకు
సర్జికల్ & రేడియేషన్ ఆంకాలజీ కన్సల్టేషన్: మానని పుండ్లు, రొమ్ములో కణతులు, గర్భసంచి కాన్సర్, థైరాయిడ్ కాన్సర్, జీర్ణకోశ కాన్సర్, రెక్టమ్ కాన్సర్, నోటి కాన్సర్, గొంతు కాన్సర్ మరియు పోస్టేట్ కాన్సర్	డా॥ సోమ శ్రీకాంత్ MS, MCh Surgical Oncology, FMAS, FICRS, FIAGES, FALS (Oncology)	


అపాయింట్‌మెంట్ కొరకు: 915 424 6125

కార్యకర్త అంత్యక్రియల్లో పాల్గొన్న ఎమ్మెల్యే

ఓదెల, మే 11 : మండలంలోని గుండ్లపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ముక్కిస గణపతిరెడ్డి అంత్యక్రియల్లో ఎమ్మెల్యే చింతకుంట్ల విజయ రమణారావు శనివారం పాల్గొన్నారు. అనంతరం ఆయన మృతదేహంపై పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఎమ్మెల్యే వెంట కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మూల ప్రేమ్‌సాగర్ రెడ్డి, సింగిల్ విండో చైర్మన్ ఆళ్ళ సుమన్ రెడ్డి, కనగర్తి, గొల్లపల్లి, పిట్టల ఎల్లయ్య పల్లి, తో పాటు తదితర గ్రామాలకు చెందిన కాంగ్రెస్ నాయకులు ఉన్నారు.

బీజేపీ అభ్యర్థిని ఓడించాలి

జ్యోతినగర్, మే 11: పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థిని ఓడించాలని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసి జిల్లా ఉపాధ్యక్షుడు లుక శంకర్ కోరారు. శనివారం ఎన్టీపీసీ పటీఎస్‌లోని కంటింజెన్సీ కార్మికుతో న్యూడెమోక్రసి నాయకులు సమావేశమయ్యారు. ఈ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థికి ఓటు వేసి గెలిపించాలని శంకర్ విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో నాయకులు బుచ్చన్న వెంకటస్వామి, నర్సయ్య, రమేష్, రాయమల్లు, సత్యం మొండయ్య, అలివేలు, సరోజన తదితరులు పాల్గొన్నారు.





అంజన్న సన్నిధిలో భక్తుల సందడి

మల్యాల, మే 11: కొండగట్టు ఆంజనేయస్వామి సన్నిధిలో శనివారం భక్తుల సందడి నెలకొంది. వేలాదిగా భక్తులు తరలివచ్చి స్వామి వారిని దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. అనం తరం బేతాళుడు, శ్రీరాముల వారిని కూడా దర్శించుకోగా ఎండ తీవ్ర తతో భక్తులు ఇబ్బందులు పడ్డారు. వందలాదిగా భక్తులు స్వామి వారి సన్నిధిలో హనుమాన్ దీక్ష తీసుకున్నారు. భక్తులకు కావల్సిన ఏర్పాట్లను ఈవో చంద్రశే ఖర్‌తో పాటు అధికారులు పర్యవేక్షించారు.

ముగిసిన ఎప్‌సెట్



తిమ్మాపూర్‌లో పరీక్ష కేంద్రంలోకి వెళ్తున్న విద్యార్థులు

తిమ్మాపూర్, మే11: ఈ నెల 7వ తేదీన ప్రారంభమైన టీఎస్ ఎప్‌సెట్ పరీక్షలు శనివారం జిల్లాలో సజావుగా ముగిసాయి. కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 9 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. శనివారం ఈ పరీక్ష కేవలం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు ఒకే సెషన్‌లో జరిగాయి. పరీక్ష సమయానికి గంటన్నర ముందు నుండే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోని అనుమతించారు. 9 పరీక్ష కేంద్రాలలో కలిపి 2709 మందికి 2674 విద్యార్థులు పరీక్షకు హాజరయ్యారు. మొత్తంగా 98.7శాతం హాజరు నమోదైందని అధికారులు తెలిపారు.

మోడల్ పోలింగ్ స్టేషన్‌ను పరిశీలించిన డీఆర్డీవో

మానకొండూర్, మే 11 : మండలంలోని లలితాపూర్ గ్రామంలో ఏర్పా టు చేసిన మోడల్ పోలింగ్ స్టేషన్‌ను శనివారం కరీంనగర్ డిఆర్డీవో శ్రీ ధర్ సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు. అనంతరం గంగిపల్లి, దేవంప ల్లి గ్రామాలలోని అమ్మ ఆదర్శ పాఠశాలల పనిని వేగవంతం చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. గంగిపల్లిలో జరుగుతున్న ఉపాధీ హామీ పనులను పరిశీలించి కూలి చెల్లింపులపై స్వయంగా కూలీలను అ డిగి తెలుసుకున్నారు. ఎంపీడీవో ఎం. నర్సయ్య, అధికారులు ఉన్నారు.

పార్లమెంట్ ఎన్నికలపై గల్ఫ్‌లో ఆసక్తి

● ఎన్‌ఆర్‌ఐలు, ప్రవాస కార్మికుల్లో సర్వత్రా చర్చ



సిరిసిల్ల క్రైం, మే 11: పార్లమెంట్ ఎన్నికలపై గల్ఫ్‌లో ఆసక్తి నెలకొంది. ప్రధానంగా గల్ఫ్ దేశాల్లో ఉపాధికోసం వెళ్లిన ప్రవాసకార్మికులు, ఎన్‌ఆర్‌ఐల్లోనూ సర్వత్రా చర్చనీయాంశమైంది. పార్లమెంటు ఎన్నికలపై ప్రవాస కార్మికులు ఎప్పటికప్పుడు తెలుసుకుంటున్నారు. ఈనెల 13న జరిగే పోలింగ్‌పై అందరి దృష్టి నెలకొంది. గల్ఫ్ సమస్యలపై కేంద్రప్రభుత్వమే పరిష్కరించే అవకాశం ఉన్నందున ఏ ప్రాంతంలో ఎవరెవరూ బరిలో నిలిచి ప్రచార సరళిపై ప్రవాస కార్మికులు ప్రత్యేక దృష్టిపెట్టారు. దుబాయ్, సౌదీ క్యాంపులలో కొందరు ఎన్‌ఆర్‌ఐ సెల్ ప్రతినిధులు అనుకూలమైన అభ్యర్థులకు మద్దతుగా ప్రచారం చేశారు.

గల్ఫ్‌లో 50వేల మంది ప్రవాస కార్మికులు

గల్ఫ్‌లో దాదాపు 50వేలమందికి పైగా ప్రవాస కార్మికులు ఉపాధి పొందుతున్నారు. లోక్‌సభ ఎన్నికల బరిలో నిలిచిన అభ్యర్థులు ఎవరేం టనేది అంచనా వేస్తున్నారు. కరీంనగర్, నిజామాబాద్ లోకసభ నియోజక వర్గం పరిధిలోని కరీంనగర్, సిరిసిల్ల, వేములవాడ, చొప్పదండి, జగిత్యాల, కొరుట్ల, మెట్‌పల్లి, ఆర్మూర్, నిజామాబాద్ నియోజకవర్గాలకు చెందిన వేలాదిమంది కార్మికులు దుబాయ్, సౌదీ, మస్కట్, కువైట్, బెహరైన్, ఇరాక్, తదితర దేశాల్లో పనిచేస్తున్నారు.

ఎవరెవరు ఏ విధమైన హామీలు ఇచ్చారనేది ప్రవాస కార్మికులు గమనిస్తున్నారు. గల్ఫ్‌లో ఉపాధి పొందుతున్న ప్రవాసకార్మికులు ఎన్‌ఆర్ ఐ పాలసీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. తమ సమస్యలు పరిష్కరించేవారికే మద్ధతు పలుకడానికి ప్రవాసకార్మికులు సిద్ధమయ్యారు. ఓటు హక్కు వినియోగిం చుకునేందుకు ఇప్పటికే వందలాది మంది ప్రవాస కార్మికులు సెలవుపై వచ్చారు.

విదేశాల్లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌ల ఆసక్తి

విదేశాల్లో ఉద్యోగం చేసే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌లు, ఉన్నత చదువులు చదివే విద్యార్థుల్లోనూ ఈనెల 13న జరిగే లోక్‌సభ ఎన్నికలపై ఆసక్తి నెలకొంది. కరీంనగర్, నిజామాబాద్ లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలో అనేకమంది అమెరికా, అస్ట్రేలియా, లండన్, కెనడా తదితర దేశాల్లో ఉన్నత ఉద్యోగాలు చేస్తున్నారు. ఉద్యోగం చేసేవారు కాకుండా ఉన్నత చదువులు చదువుతున్నారు. పోటీ ఎలా ఉందనేది స్వగ్రామాల్లో తెలుసుకుంటున్నారు.

హ్యాండ్‌బాల్ వేసవి శిక్షణ శిబిరానికి స్పందన

వెల్గటూర్, మే 11: చెగ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రారంభించిన హాండ్ బాల్ వేసవి శిక్షణ శిబిరానికి విశేష స్పందన లభించినట్లు పీఈటీ అశోక్ తెలిపారు. ఈ నెల 1 నుండి 31 వరకు వేసవి శిక్షణ శిబిరం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామం లోని యువకులకు క్రీడల పట్ల అవగాహన కల్పించేలా కృషి చేస్తున్నట్లు తెలిపారు. చెడు వ్యసనాల నుండి, మొబైల్ ఫోన్ల నుండి దూరం చేసేలా ప్రతి రోజు ఉదయం, సాయంత్రం శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు.

ఎన్నికల నియమావళి పాటించకుంటే చర్యలు



కవాతు నిర్వహిస్తున్న కేంద్ర బలగాలు

తంగళ్లపల్లి, మే 11: ఎన్నికల నియమావళిని పాటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండల కేంద్రంతో పాటు నేరెళ్ల, జిల్లెల గ్రామాల్లో లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో ట్రైనీ ఐపీఎస్ రాహుల్ రెడ్డి, సిరిసిల్ల రూరల్ సీఐ సదన్ కుమార్, ఎస్ఐ సుధాకర్‌ల ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ బలగాలు, పోలీస్ బలగాలతో ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 13వ తేదీన జరగనున్న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో భయాందోళనలకు తావు లేకుండా చేసేందుకు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించామన్నారు.

ఇల్లంతకుంట: లోకసభ ఎన్నికల నేపథ్యంలో ఇల్లంతకుంట, జవారిపేటలో కేంద్ర పోలీసు బలగాలు శనివారం కవాతు నిర్వహించాయి. ఈ సందర్భంగా సిరిసిల్ల రూరల్ సీఐ సదన్‌కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు ఓటుహక్కు వినియోగించుకోవాలన్నారు. గ్రామాలలో ఉద్రిక్త వాతావరణం కలిగించాలని చూసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఓటర్లు ప్రలోభాలకు గురికావద్దన్నారు. ఎస్సై రాజుగౌడ్ ఉన్నారు.

చందుర్తి: శాంతి భద్రతల పరిరక్షణ కోసమే ఫ్లాగ్ మార్చ్ నిర్వహిస్తున్నట్లు వేములవాడ డీఎస్పీ నాగేంద్ర చారి పేర్కొన్నారు. చందుర్తి మండల కేంద్రంలో కేంద్ర సాయుధ బలగాలతో ప్రధాన వీధుల్లో శనివారం ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ఎవరైనా చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవన్నారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ పాల్గొన్నారు.

రుద్రంగి: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రశాంత వాతావరణంలో ఓటుహక్కు వినియోగించుకునేలా ప్రజలకు భరోసా కల్పించేందుకు రుద్రంగి మండల కేంద్రంలో శనివారం కేంద్ర పోలీస్ బలగాలు కవాతు నిర్వహించారు. చందుర్తి సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ అశోక్ పాల్గొన్నారు.

పోలీసుల విస్తృత తనిఖీలు



కరీంనగర్‌లో తనిఖీలను పర్యవేక్షిస్తున్న సీపీ

కరీంనగర్ క్రైం, మే 11 : పోలీస్‌కమిషనరేట్ వ్యాప్తంగా పోలీసులు శనివారం రాత్రి విస్తృతంగా తనిఖీలు నిర్వహించారు. కరీంనగర్ పోలీస్‌కమిషనర్ అభిషేక్ మొహంతి స్వయంగా తనిఖీలను పర్యవేక్షించారు. లోక్‌సభ ఎన్నికల ప్రచారం ముగిసి పోలింగ్‌కు కొన్ని గంటల సమయమే ఉండగా ఎన్నికల కోడ్ అమలులో భాగంగా పోలీసులు ఆకస్మిక తనిఖీలను నిర్వహిస్తున్నారు.

వికలాంగుడి అనుమానాస్పద మృతి

మల్లాపూర్, మే, 11: మండల కేంద్రానికి చెందిన అరికొప్పుల రాజేందర్(33) అనే వికలాంగుడు అనుమానస్పదంగా మృతి చెందినట్లు శనివారం కుటుంబ సభ్యులు తెలిపారు. కుటుంబ సభ్యులు, గ్రామస్థులు తెలిపిన వివరాల ప్రకారం...గ్రామానికి చెందిన అరికొప్పుల రాజేందర్ కాలకృత్యాలు తీర్చుకోవడానికి తన మూడు చక్రాల బండిపై గ్రామ శివారులోని కాలువ వద్దకు వెళుతూ ఉండేవాడు. శనివారం కాలువ వద్ద రాజేందర్ రక్తం కారుతూ కింద పడి ఉండడాన్ని స్థానికులు గమనించి కుటుంబ సభ్యులు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలం చేరుకొని రాజేందర్‌ను పరిశీలించగా మృతి చెందినట్లు గుర్తించారు. మృతదేహాన్ని మెట్‌పల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. రాజేందర్ మృతదేహం వద్ద అతను ఉపయోగించే మూడు చక్రాల బండి పడి ఉండడంతో కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేస్తూ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పార్వతీ కోటేశ్వర స్వామి కల్యాణానికి ఏర్పాట్లు పూర్తి

వెల్గటూర్, మే 11: కోటిలింగాల శ్రీ పార్వతీ కోటేశ్వర స్వామి కల్యాణానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఆలయాన్ని మామిడి తోరణాలతో అందంగా అలంకరించారు. కల్యాణ మంటపాన్ని వివిధ రకాల పూలతో అందంగా అలంకరించారు. ప్రతీ సంవత్సరం శంకర జయంతి సందర్భంగా స్వామి వారల కల్యాణం జరపడం ఆనవాయితీగా వస్తోంది. వైశాఖ శుద్ధ పంచమి ఆరుద్ర నక్షత్ర యుక్త అభిజిత్ లగ్న పుష్కరాంశ సుమూహూర్తాన స్వామి వారి కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించడానికి, కల్యాణం వీక్షించడానికి వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బంది కలుగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు ఆలయ ఈవో కాంతారెడ్డి తెలిపారు. కల్యాణ మహోత్సవంలో భాగంగా శనివారం స్వామి వారికి అఖండ దీపారాధన, అంకురార్పణ, ధ్వజారోహణ, నవగ్రహారాధన, గణపతి పూజ, పుణ్యాహవచనం, మంత్రపుష్పం, తీర్థప్రసాద వితరణ కార్యక్రమాలు నిర్వహించినట్లు ఆలయ అర్చకులు నాగరాజుశర్మ, సంజీవ్‌శర్మలు తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు విచ్చేసి స్వామి వారి కృపాకటాక్షాలు పొందాలని అర్చకులు, ఈవో కాంతారెడ్డి కోరారు.

ఘనంగా రామానుజుల జయంతి



స్వామివారి ఉత్సమూర్తుల ఊరేగింపు

ఇల్లందకుంట, మే 11: మండల కేంద్రంలోని శ్రీసీతారామచంద్రస్వామి దేవాలయంలో భగవత్ రామానుజుల వారి 1007 జయంతి ఉత్సవాలు శనివారం రాత్రి కన్నుల పండువగా నిర్వహించారు. ఈ నెల 12న రామానుజుల జయంతిని పురస్కరించుకొని స్వామివారి ఉత్సవమూర్తులను గ్రామ పురవీధుల గుండా భక్తుల హర్ష ధ్వానాల నడుమ పల్లెకిలో ఊరేగించారు. ఈ ఉత్సవాలు ఆలయంలో రెండ్రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కార్యానిర్వాహణాధికారి కందుల సుధాకర్, ఆలయ ప్రధాన అర్చకుడు శేషం రామాచార్యులు తెలిపారు.













పార్లమెంట్ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ పమేలా సత్పతి



మాట్లాడుతున్న ఎన్నికల రిటర్నింగ్ అధికారి పమేలా సత్పతి

కరీంనగర్, మే 11(ఆంధ్రజ్యోతి, ప్రతినిధి): ఈ నెల 13న జరిగే పార్లమెంట్ ఎన్నికలకు పటిష్టమైన ఏర్పాట్లు పూర్తిచేసినట్లు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జిల్లా కలెక్టర్ పమేలాసత్పతి తెలిపారు. శనివారం సాయంత్రం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పార్లమెంట్ ఎన్నికల ఏర్పాట్లను వివరించారు. పోలింగ్ స్వేచ్ఛాయుత, ప్రశాంత వాతావరణంలో జరిగేలా సర్వం సిద్ధం చేశారు. పార్లమెంట్ పరిధిలోని ఏడు అసెంబ్లీ నియోజకవర్గాల్లో 2,194 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని, వీటిలో 288 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలను గుర్తించి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామని అన్నారు. 17 లక్షల 97వేల మంది ఓటర్లు ఉన్నారని, ఓటర్లలో పురుషులకంటే 40వేల మహిళా ఓటర్లు అధికంగా ఉన్నారని అన్నారు. 42వేల మంది దివ్యాంగులు, 13,200 మంది వయోవృద్ధులు ఓటు హక్కు వినియోగించుకునేందుకు ప్రత్యేక ఏర్పాట్లు చేశామని చెప్పారు. 8,815 మంది ఉద్యోగులు తమ ఓటు హక్కును పోస్టల్ బ్యాలెట్ ద్వారా వినియోగించుకున్నారని తెలిపారు. ఎలక్షన్ డ్యూటీ సర్టిఫికెట్ కింద నమోదు చేసుకున్న 6,800 మంది ఉద్యోగులు పోలింగ్ రోజున ఓటు హక్కును వినియోగించుకుంటారని కలెక్టర్ తెలిపారు. 28 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారని, నోటాతో కలుపుకొని ఒకటి ఎక్స్‌ట్రా ఉండడంతో ఒక్కో పోలింగ్ స్టేషన్‌లో రెండు బ్యాలెట్ యూనిట్లను ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. ఎక్కడ ఎన్నికల నియమావళి ఉల్లంఘన జరుకుండా 21 ఎఫ్ఎస్‌టి టీం, 14 ఎస్ఎస్‌టీ టీంలను ఏర్పాటు చేశామని అన్నారు. సీ-విజిల్ యాప్ ద్వారా 200 ఫిర్యాదులు రాగా వాటిలో 144 ఫిర్యాదులను పరిష్కరించామన్నారు. 215 రూట్లలో 216 మంది సెక్టార్ ఆఫీసర్లను నియమించామని, ఈవీఎంలను తీసుకెళ్లే వాహనాలకు జీపీఎస్ అనుసంధానం చేశామని అన్నారు. స్థానికేతరులు శనివారం సాయంత్రం 6 తర్వాత వెళ్లి పోవాలని ఆదేశించారు.

రూ. 9.98 లక్షల నగదు పట్టివేత

కరీంనగర్ క్రైం, మే 11: కరీంనగర్‌లోని టవర్‌సర్కిల్ వద్ద శనివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో 9 లక్షల 98 వేల రూపాయలు నగదు పట్టుబడిందని ఒకటో టౌన్ సీఐ సరిలాల్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమలులో భాగంగా వాహనాల తనిఖీ చేస్తుండగా పాతబజారు శివాలయం వీధికి చెందిన వట్టిమల్ల రవీందర్ వద్ద 9.98 లక్షల నగదు పట్టుబడగా ఈ నగదుకు సంబంధించిన సరైన ఆధారాలు చూపెట్టనందున సీజ్ చేశామని సీఐ తెలిపారు. పట్టుబడిన నగదును సంబంధిత ఎన్నికల అధికారికి స్వాధీనం చేశామని తెలిపారు.

మద్యం షాపులు మూసివేత



వైన్‌షాపునకు సీల్ వేస్తున్న పోలీసు

కరీంనగర్ క్రైం, మే 11: 13న లోక్‌సభ ఎన్నికల నేపథ్యంలో శనివారం సాయంత్రంతో ఎన్నికల ప్రచారం ముగిసింది. అలాగే మద్యం షాపుల కూడా మూసివేశారు. వైన్‌షాపులు, బార్ అండ్ రెస్టారెంట్‌లతో పాటు కల్లు షాపులు, మద్యం డిపో, కల్లు డిపోలను కమిషనరేట్ వ్యాప్తంగా ఎక్సైజ్ అధికారులు మూసివేయించారు. పోలింగ్ పూర్తి అయిన తరువాత సోమవారం సాయంత్రం 6 గంటల అనంతరం షాపులను తెరిచేందుకు అనుమతిస్తారు.

మద్యం పట్టివేత

కరీంనగర్ క్రైం: కరీంనగర్‌లోని సుభాష్‌నగర్‌లో మూడో టౌన్ పోలీసులు శనివారం నిర్వహించిన తనిఖీల్లో రెండు చోట్ల 52,200 రూపాయల మద్యం పట్టుబడింది. మానకొండూర్‌కు చెందిన పుట్ట మహేందర్ వద్ద 46,800 రూపాయల 28.2 లీటర్ల మద్యం పట్టుబడింది. కిసాన్‌నగర్‌కు చెందిన గొట్టిముక్కుల సాయికాంత్, విజయ్‌కుమార్‌ల వద్ద 5,400 రూపాయల విలువైన బీర్లు పట్టుబడ్డాయి. పోలీసులు కేసు నమోదు చేశారు.

ఎన్నికలకు పటిష్ట బందోబస్తు

- సీపీ అభిషేక్ మొహంతి
- పోలీసు అధికారులతో సమీక్ష



సమావేశంలో మాట్లాడుతున్న సీపీ అభిషేక్ మొహంతి

కరీంనగర్ క్రైం, మే 11: పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా 2,500 పోలీస్ ఫోర్స్‌ను వినియోగించనున్నామని సీపీ అభిషేక్ మొహంతి తెలిపారు. కరీంనగర్ కమీషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్‌హాలులో ఎన్నికలకు కేటాయించిన పోలీస్, కేంద్ర బలగాల అధికారులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 13న నిర్వహించ బోయే లోకసభ ఎన్నికలకు పూర్తి స్థాయిలో పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేశామన్నారు. పోలింగ్ కేంద్రాల వారీగా సిబ్బంది కేటాయించామన్నారు. అన్ని పోలింగ్ లోకేషన్లకు రూట్ ఆఫీసర్స్‌తో పాటు స్ట్రైకింగ్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్‌లను కేటాయించామన్నారు. సున్నితమైన, సమస్యాత్మక ప్రాంతాల్లో స్థానిక పోలీసులతో పాటు, కేంద్ర పారా మిలిటరీ బలగాలను కేటాయించామని తెలిపారు. సిబ్బంది ఆదివారం డిస్ట్రిబ్యూషన్ సెంటర్లకు వెళ్లాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ అధికారులు, సిబ్బంది ఎన్నికల సామగ్రిని, ఈవీఎంలను స్వీకరించిన తరువాత వాటికి భద్రతగా వారితో పాటు, కేటాయించి పోలింగ్ లోకేషన్ , కేంద్రాన్ని తెలుసుకుని వారి వెంటే పోలింగ్ కేంద్రాలకు చేరుకోవాల్సి ఉంటుందన్నారు. పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నప్పటి నుంచి ఎన్నికలు ముగిసే వరకు ఎట్టి పరిస్థితుల్లో పోలింగ్ కేంద్రాన్ని విడిచి వెళ్లవద్దని సూచించారు. పోలింగ్ రోజున ఉదయం 6 గంటలకే విధుల్లో చేరాలన్నారు. పోలింగ్ రోజున ఓటర్లను క్యూ పద్ధతిలో ఉండేలా చూసుకోవాలన్నారు. ఓటు వేసేందుకు వచ్చే మహిళలు, వృద్ధులతో పాటు అన్ని వర్గాల ప్రజలతో సత్ప్రవర్తనతో మెదలాలన్నారు. శాంతి భద్రతల సమస్యలు తలెత్తితే వాటిని నివారించేందుకు రూట్ ఆఫీసర్, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్స్ అధికారులను కేటాయించా మన్నారు. ప్రిసైడింగ్ అధికారి అనుమతి లేనిదే పోలింగ్ కేంద్రంలోకి వెళ్ల వద్దని, వారు పిలిస్తేనే వెళ్లాలని సూచించారు.

ఎన్నికలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలి

కరీంనగర్ క్రైం : పోలీస్ కమిషనరేట్ వ్యాప్తంగా లోక్‌సభ ఎన్నికలు ముగిసే వరకు అప్రమత్తంగా ఉండాలని పోలీస్ కమిషనర్ అభిషేక్ మొహంతి అన్నారు. కరీంనగర్ కమిషనరేట్ కేంద్రంలోని కాన్ఫరెన్స్ హాలులో ఎన్నికలకు కేటాయించబడిన స్పెషల్ యాక్షన్ టీమ్ అధికారులతో శనివారం సీపీ అభిషేక్ మొహంతి సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాలను క్లస్టర్‌లుగా విభజించుకుని ప్రతీ క్లస్టర్‌కు స్పెషల్ యాక్షన్ టీంలను కేటాయించామన్నారు. శాంతి భద్రతల సమస్య తలెత్తితే వెంటనే టీమ్స్ స్పందించి వీలైనంత త్వరగా సంఘటనా స్థలానికి చేరుకొని సమస్యను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో ముగిసేలా చర్యలు చేపట్టాలన్నారు.

రాష్ట్రవ్యాప్తంగా క్రికెట్ శిక్షణ శిబిరాలు

- కరీంనగర్‌లో హెచ్‌సీఏ తరపున స్టేడియం ఏర్పాటుకు కృషి
- హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మెహన్ రావు



మాట్లాడుతున్న హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మెహన్‌రావు

కరింనగర్ స్పోర్ట్స్, మే 11: క్రికెట్‌ను అన్ని జిల్లాల్లో అభివృద్ధి పరిచేందుకు రాష్ట్ర వ్యాప్తంగా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్నామని హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మెహన్ రావు న్నారు. కరీంనగర్‌లో క్రికెట్‌కు మంచి ఆదరణ ఉందని, హెచ్‌సీఏ తరఫున క్రికెట్ స్టేడియం ఏర్పాటు చేసేందుకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తానని ఆయన హామీ ఇచ్చారు. హెచ్‌సీఏ, కేడీసీ ఆధ్వర్యంలో కరీంనగర్‌లో జరుగుతున్న క్రికెట్ శిక్షణ శిబిరాలను శనివారం అపెక్స్ కమిటీ సందర్శించింది. ఈ సందర్భంగా జగన్‌మెహన్‌రావు మాట్లాడుతూ మొత్తం 29 క్రికెట్ శిక్షణ కేంద్రాల్లో 3 వేల మంది చిన్నారులు శిక్షణ పొందుతున్నారన్నారు. వచ్చే సంవత్సరం రాష్ట్రంలో శిక్షణ శిబిరాల సంఖ్యను రెండింతలు చేయనున్నట్లు తెలిపారు. వచ్చే సంవత్సరం నాటికి కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి కనీసం ఐదుగురు క్రీడాకారులు ఐపీఎల్ స్థాయికి ఎదగాలని సూచించారు. కరీంనగర్ జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు వి.ఆగంరావు మాట్లాడుతూ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు కేంద్రాల్లో శిక్షణ శిబిరం నడుస్తోందని, సుమారు 450 మందికి పైగా క్రీడాకారులు శిక్షణలో పాల్గొంటున్నారన్నారు. కరీంనగర్ లో టర్ఫ్ క్రికెట్ మైదానాన్ని ఏర్పాటు చేయాలని హెచ్‌సీఏను కోరారు. ఈ సందర్భంగా హెచ్‌సీఏ అధ్యక్షుడు జగన్‌మోహన్‌రావు కాసేపు బ్యాటింగ్ చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ క్రికెట్ సంఘం ఉపాధ్యక్షుడు దల్జీత్ సింగ్, కార్యదర్శి దేవరాజ్, కోశాధికారి శ్రీనివాస్ రావు, జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి ఎన్ మురళీధర్ రావు, ఉపాధ్యాక్షులు మనోహర్ రావు, కోచ్‌లు డి శ్రీనివాస్, కిరణ్, సుదేష్, అజిత్, ప్రసాద్, శ్రావణ్, పూర్ణచందర్, శ్రీనాథ్ లతో పాటు క్రీడాకారులు, తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లా క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో అపెక్స్ కమిటీ సభ్యులను సత్కరించి జ్ఞాపికలను అందజేశారు.



గోదావరిలో యువకుడి గల్లంతు

ధర్మపురి, మే 11: ధర్మపురి వద్ద గోదావరిలో శనివారం ఒక యువకుడు గల్లంతయ్యాడు. గోదావరిలో స్నానం చేసేందుకు దిగిన 35 ఏళ్ల యువకుడు ఈత రాక పోవడం వల్ల నీటిలో మునిగి గల్లంతు అయ్యాడు. సమాచారం అందుకున్న పోలీసులు అక్కడికి చేరుకుని గల్లంతయిన యువకుడి కోసం జాలర్ల సాయంతో వెతుకుతున్నారు.

ఓటు హక్కును వినియోగించుకోవాలి

- టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్



మాట్లాడుతున్న టీఎన్‌జీవో నాయకులు

సుభాష్‌నగర్, మే11: ఓటు హక్కును వినియోగించుకుందాం..దేశ భవిష్యత్తును కాపాడుకుందామని టీఎన్‌జీవో రాష్ట్ర అధ్యక్షుడు మారం జగదీశ్వర్ పిలుపునిచ్చారు. శనివారం టీఎన్‌జీవో జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో టీఎన్‌జీవో భవన్‌లో ఓటర్లు, పోలింగ్ సిబ్బందికి పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా టీఎన్‌జీవో నాయకులు మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరుదే కీలక పాత్ర అని అన్నారు. ప్రలోభాలకు గురి కాకుండా తమ అమూల్యమైన ఓటు హక్కును వినియోగించుకోవాలని కోరారు. పోలింగ్ స్టేషన్‌లో విధులు నిర్వహించే ఉద్యోగులు తగు జాగ్రత్తలు పాటించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి సంగెం లక్ష్మీనారాయణ, రూరల్ అధ్యక్షుడు మారుపాక రాజేశ్ భరద్వాజ్, సుధీర్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇద్దరి రిమాండ్

ఎల్లారెడ్డిపేట, మే 11: ఎల్లారెడ్డిపేట మండలం సింగారంలో ఈ నెల 9న చేపల వేటకు వెళ్లి అదే గ్రామానికి చెందిన ముత్యాల బాలకృష్ణ విద్యుదాఘాతంతో మృతి చెందడానికి కారణం గ్రామంలోని బొమ్మిడి శంకర్, పూటకుల్ల సుధీర్ అని వీరిని రిమాండ్‌కు తరలించామని ఎల్లారెడ్డిపేట రూరల్ సీఐ శ్రీనివాస్‌గౌడ్ శనివారం తెలిపారు. మండలంలోని సింగారం గ్రామంలో ఈ నెల 9న బాలకృష్ణను శంకర్, సుధీర్ గ్రామ శివారులోని మానేరు వాగులో కరెంటు షాక్‌తో చేపలు పట్టేందుకు తీసుకెళ్లారు. చేపలు పడుతున్న క్రమంలో బాలకృష్ణ చేపలకు అమర్చిన తీగకు విద్యుత్ సరఫరా కావడంతో చనిపోయాడు. అతడి మృతికి కారణమైన శంకర్, సుధీర్‌పై కేసు నమోదు చేసిన పోలీసులు విచారణ చేపట్టారు. ఇద్దరిని అరెస్ట్ చేసి కోర్టులో హాజరు పర్చారు. న్యాయమూర్తి 15 రోజుల రిమాండ్ విధించినట్లు సీఐ శ్రీనివాస్‌గౌడ్ వివరించారు.

గంజాయి తరలిస్తున్న ఇద్దరి అరెస్టు

ముస్తాబాద్, మే 11: ముస్తాబాద్ పట్టణ కేంద్రం నుంచి గంజాయి తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్టు చేసినట్లు ఎస్సై శేఖర్‌రెడ్డి తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. మాచారెడ్డి మండలం సోమార్‌పేటకు చెందిన కట్కూరి కుమారస్వామి, మాచారెడ్డికి చెందిన వంగ వినయ్ కుమార్ ద్విచక్రవాహనంపై 20 గ్రాముల గంజాయిని తరలిస్తుండగా మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల ప్రాంతంలో పట్టుకున్నట్లు తెలిపారు. ద్విచక్రవాహనం, గంజాయిని స్వాధీనం చేసుకున్నామని పోలీసులు పేర్కొన్నారు.

వృద్ధురాలి ఆత్మహత్య

కోనరావుపేట,మే11: కోనరావుపేట మండలం బావుసాయిపేట గ్రామానికి చెందిన వంగల మణమ్మ (70)అనే వృద్ధురాలు ఇంట్లో చీరతో దూలానికి ఉరివేసుకుని శుక్రవారం రాత్రి ఆత్మహత్యకు పాల్పడింది. పోలీసులు తెలిపి న వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన మణెమ్మ కుమారుడు వంగల వెంకటేష్ తల్లి బాగోగులు చూడకపోవడంతో ఒంటరిగా ఉంటోంది. అంతేకా కుండా ఆరోగ్యం కూడా సహకరించకపోవడంతో మనస్థాపానికి గురైన మణెమ్మ ఉరి వేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న కోనరావుపేట ఎస్సై ఆంజనేయులు సంఘటన గల కారణాలను పరిశీలించి పోస్టుమార్టం నిమిత్తం సిరిసిల్ల ఏరియా ఆసుపత్రికి తరలించారు. కాగా ఈ విషయమై కూతురు ననుగుల భూలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు.

పశుగ్రాసానికి నిప్పుపెట్టిన మహిళపై కేసు

చందుర్తి, మే 11: పశుగ్రాసానికి నిప్పుపెట్టిన ఓ మహిళపై కేసు నమోదైనట్లు చందుర్తి ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. ఎస్సై కథనం ప్రకారం చందుర్తి మండల కేంద్రంలోని కోన మల్లయ్య అనే రైతుకు చెందిన గడ్డివాముకు రామన్నపేట గ్రామం చెందిన పోతరాజు చిన్న భూమ్మక్క అనే మహిళ నిప్పు పెట్టింది. మల్లయ్య ఫిర్యాదు మేరకు భూమక్కపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇద్దరు విద్యుత్ ఉద్యోగుల సస్పెన్షన్

గంగాధర, మే 11: గంగాధర సబ్‌స్టేషన్‌లో పనిచేస్తున్న ఇద్దరు విద్యుత్ ఉద్యోగులను సస్పెండ్ చేస్తూ ఎస్ఈ గంగాధర్ ఉత్తర్వులు జారీ చేవారు. గంగాధర పంచాయతీ ఎలక్ట్రీషియన్ మూడురోజుల క్రితం విద్యుత్ షాక్‌కు గురైయ్యాడు. గంగాధర లైన్‌మన్ శ్రీనివాస్, ఆపరేటర్ అంతులాల్‌లు ప్రమాదానికి కారణమంటూ ఆరోపణలు వచ్చాయి. దీంతో ఇద్దరిని సస్పెండ్ చేస్తూ శుక్రవారం ఎస్ఈ ఉత్తర్వులు జారీ చేశారు.

మహిళ ఆకస్మిక మృతి

శంకరపట్నం, మే 11: శంకరపట్నం మండలం తాడికల్ గ్రామంలో ఓ మహిళ ఎండ తీవ్రతతో ఆకస్మికంగా మృతి చెందింది. స్థానికులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. సైదాపూర్ మండలం గొడిశాల గ్రామానికి చెందిన గొల్లపల్లి శోభ (32) వారం రోజుల క్రితం తల్లిగారి ఊరు తాడికల్‌కు వచ్చింది. శనివారం అన్నం తింటుండగా ఉన్నట్లు ఉండి ఒక్కసారి కుప్పకూలి మృతి చెందింది. మృతురాలికి ఇద్దరు కూతుళ్లు ఉన్నట్లు తెలిపారు.

అభ్యర్థుల్లో గుబులు

- మూడు రోజుల పాటు వరుస సెలవులు
- విహార యాత్రలకు సిద్ధమవుతున్న జనం
- పోలింగ్ శాతం తగ్గుతుందేమోనని అనుమానం

జగిత్యాల, మే 11 (ఆంధ్రజ్యోతి): లోక్‌సభ ఎన్నికల సందర్భంగా వరుస సెలవులు వస్తుండటంతో అభ్యర్థుల్లో గుబులు రేగుతోంది. ఈ నెల 11,12,13 వరకు వరుస సెలవులు ఉండటంతో కొందరు ప్రజలు విహార యాత్రలకు సిద్ధమవుతున్నారు. దీంతో పోలింగ్ శాతం తగ్గుతుందేమోననే అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఈ నెల 13న పోలింగ్ ఉండగా, ప్రభుత్వం అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థలకు సెలవు ప్రకటించింది. దీనికి తోడు పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు చేసిన కేంద్రాలకు సైతం ముందస్తుగా సెలవును ప్రకటించారు. దీంతో ఉద్యోగులకు వరుసగా మూడు రోజులు సెలవులు వస్తుండటంతో పిల్లలతో కలిసి విహార యాత్రలకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నట్లు సమాచారం.. ఇన్నాళ్లు గడప గడప తిరిగి ప్రచారం చేసుకున్న అభ్యర్థులకు ఇప్పుడు కలవరం మొదలైంది. పోలింగ్ శాతం పడిపోతే తమకెక్కడ ఇబ్బంది అవుతుందోనని ఆందోళన చెందుతున్నారు. పోలింగ్ శాతం పెంచే విధంగా ప్రతి ఒక్కరితో ఓటు వేయించాలని అభ్యర్థులు వారి అనుచరులకు సూచనలు చేస్తున్నారు. ఉద్యోగాలు, వ్యాపారాల నిమిత్తం దూర ప్రాంతాల్లో ఉంటున్న వారిని కూడా రప్పించేందుకు ఆయా పార్టీల వారు ఏర్పాట్లు చేస్తున్నట్లు సమాచారం.

కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా బీజేపీ

- టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్



మాట్లాడుతున్న టీజేఎస్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం

సుభాష్‌నగర్, మే 11: దేశాన్ని ఏలుతున్న బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ శక్తులకు అనుకూలంగా వ్యవహరిస్తోందని తెలంగాణ జనసమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరామ్ పేర్కొన్నారు. శనివారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగాన్ని మారుస్తామని బీజేపీ నాయకులు మాట్లాడుతున్నారని, దేశ సంపదను అదానీ, అంబానీలకు దోచిపెడుతున్నారని ఆరోపించారు. జీఎస్టీ, పెట్రోలు ధరలు పెంపుతో రూ.58 లక్షల కోట్ల ఆర్థిక భారాన్ని ప్రజలపై మోపిందన్నారు. ప్రజల మధ్య అసమానతలను పెంచిందన్నారు. దేశంలో ఎన్నడూ లేని విధంగా నిరుద్యోగం పెరిగిందన్నారు. దేశంలోని సైన్యాన్ని బలహీనపరిచిందన్నారు. 60 నుంచి 70 శాతం సైన్యాన్ని రిక్రూట్‌మెంట్ చేయాల్సి ఉండగా, చైనా తరహాలో సైన్యాన్ని ప్రైవేటీకరణ చేయాలని కేంద్రం చూస్తోందని కోదండరామ్ ఆరోపించారు. సైన్యాన్ని బలహీన పరిచిన వారు దేశాన్ని ఏం ఏలుతారని ప్రశ్నించారు. దేశ వనరులన్నీ కార్పొరేట్ శక్తులకు అప్పగిస్తున్నారని ఆరోపించారు. రాజ్యాంగాన్ని కాపాడి, దేశ వనరులను ప్రజలకు అప్పగిస్తామంటున్న కాంగ్రెస్ పార్టీకి ఓటు చేయాని ఆయన కోరారు. కరీంనగర్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి వెలిచాల రాజేందర్‌రావును గెలిపించాలని కోరారు. సమావేశంలో ముక్కెర రాజు, అంబటి నాగయ్య, నరహరి జగ్గారెడ్డి, నర్సయ్య, కనకం కుమారస్వామి, లక్ష్మీబాయి, సునీత, రమేశ్, కర్ర సతీష్, ఐల ప్రసన్న, అంబటి శ్రీనివాస్, ప్రొఫెసర్ వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అదానీ, అంబానీల చేతుల్లోకి వ్యవసాయ రంగం

హుజూరాబాద్: వ్యవసాయ ఉత్పత్తులకు కనీస మద్దతు ధరను చట్టబద్ధం చేయాలని జరిగిన రైతుల ఉద్యమాలపై నిర్బంధాన్ని ప్రయోగించి వందలాది మంది రైతులకు చావుకు కారణమైన మోదీ మళ్లీ అధికారంలోకి వస్తే వ్యవసాయ రంగం అదానీ, అంబానీల చేతుల్లోకి వెళ్తుందని తెలంగాణ జన సమితి రాష్ట్ర అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం అన్నారు. శనివారం హుజూరాబాద్ పట్టణంలోని సిటీ సెంట్రల్ హాల్‌లో 'ప్రమాదంలో భారత ప్రజాస్వామ్యం అనే సదస్సు' నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ప్రొఫెసర్ కోదండరాం హాజరై మాట్లాడారు. ప్రజాస్వామ్యాన్ని రక్షించడం కోసమే రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో బీజేపీ పార్టీని, మోదీని ఓడించాలన్నారు.

పోలింగ్ సిబ్బంది మూడో దశ ర్యాండమైజేషన్ పూర్తి

- పెద్దపల్లి రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


ఆన్‌లైన్ ద్వారా ర్యాండమైజేషన్ పరిశీలిస్తున్న కలెక్టర్, ఎన్నికల పరిశీలకులు

పెద్దపల్లి, మే 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జరిగే లోక్‌సభ ఎన్నికల నిర్వహణకు పోలింగ్ సిబ్బంది మూడో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియ పూర్తి చేసినట్లు పెద్దపల్లి పార్లమెంటు ఎన్నికల రిటర్నింగ్ అధికారి, కలెక్టర్ కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. శనివారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో ఆయన ఎన్నికల సాధారణ పరిశీలకులు రావీష్ గుప్తా, అదనపు కలెక్టర్లు జే అరుణశ్రీ, జీవీ శ్యామ్ ప్రసాద్‌లాల్‌తో కలిసి ఆన్‌లైన్ ద్వారా పోలింగ్ సిబ్బంది మూడో దశ ర్యాండమైజేషన్ ప్రక్రియను నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో మూడు అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 840 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, మూడో దశ పోలింగ్ సిబ్బంది ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాల వారీగా పోలింగ్ సిబ్బందిని కేటాయించామని తెలిపారు. జిల్లాలోని రామగుండం అసెంబ్లీ సెగ్మెంట్‌లో 260 పోలింగ్ కేంద్రాలకు 306 పోలింగ్ బృందాలు, మంథని అసెంబ్లీ సెగ్మెంట్‌లో 290 పోలింగ్ కేంద్రాలకు 339 పోలింగ్ బృందాలు, పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో 290 పోలింగ్ కేంద్రాలకు 342 పోలింగ్ బృందాలు అందుబాటులో ఉన్నాయన్నారు. మూడోదశ ర్యాండమైజేషన్‌లో పోలింగ్ కేంద్రాల వారీగా పోలింగ్ బృందాలను ఆన్‌లైన్ సాఫ్ట్‌వేర్ వినియోగించుకొని పారదర్శకంగా కేటాయించా మన్నారు. ప్రతి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఐదు మహిళా పోలింగ్ కేంద్రాలు, ఒక యూత్ పోలింగ్ కేంద్రాలు, ఒక దివ్యాంగుల పోలింగ్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ తెలిపారు. అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో గుర్తించిన సమస్యాత్మక పోలింగ్ కేంద్రాలకు మైక్రో అబ్జర్వర్లను కేటాయించామన్నారు. రామగుండం అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉన్న ఒక సమస్యాత్మక లోకేషన్‌కు ఇద్దరు మైక్రో అబ్జర్వర్లను, మంథని అసెంబ్లీ సెగ్మెంట్ పరిధిలో ఉన్న 47 సమస్యాత్మక లోకేషన్‌లకు 57 మంది మైక్రో అబ్జర్వర్లను, పెద్దపల్లి అసెంబ్లీ సెగ్మెంట్ పరిధి ఉన్న 16 సమస్యాత్మక లోకేషన్‌లకు 20 మంది మైక్రో అబ్జర్వర్లను కేటాయించామని తెలిపారు. అనంతరం పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ఉన్న ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్ జగిత్యాల జిల్లా కలెక్టర్ యాస్మిన్ భాషా, మంచిర్యాల, చెన్నూరు బెల్లంపల్లి అసెంబ్లీ సెగ్మెంట్లకు మంచిర్యాల జిల్లా కలెక్టర్ బి సంతోష్ పోలింగ్ బృందాలను, మైక్రో అబ్జర్వర్లను ఆన్‌లైన్ ద్వారా పెద్దపల్లి పార్లమెంట్ ఎన్నికల పరిశీలకులు రావిష్ గుప్త ఆధ్వర్యంలో కేటాయించారు. కార్యక్రమంలో ఆర్డీవో హనుమానాయక్, డీఈవో మాధవి, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు సర్వం సిద్ధం

- బందోబస్తుకు ఐదు కంపెనీల కేంద్ర బలగాలు
- 178 సమస్యాత్మక కేంద్రాలపై ప్రత్యేక దృష్టి
- రామగుండం సీపీ శ్రీనివాస్

కోల్‌సిటీ, మే 11: లోక్‌సభ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించేందుకు రామగుండం కమిషనరేట్ పరిధిలో సర్వం సిద్ధం చేసినట్లు రామగుండం పోలీస్ కమిషనర్, ఐజీ ఎం శ్రీనివాస్ పేర్కొన్నారు. శనివారం కమిషనరేట్‌లో లోక్‌సభ ఎన్నికలపై జరిగిన మీడియా వర్క్‌షాప్‌లో సీపీ మాట్లాడారు. కమిషరేట్ పరిధిలోని పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గంలో పెద్దపల్లి, మంచిర్యాల జోన్‌లలో మంథని, పెద్దపల్లి, రామగుండం, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లితో పాటు ధర్మపురిలో కొంత భాగం ఉందన్నారు. ఇందులో 1,568 పోలింగ్ స్టేషన్లు ఉండగా 179 సమస్యాత్మక కేంద్రాలు ఉన్నాయన్నారు. ఇందులో మావోయిస్టు ప్రభావిత పోలీస్ స్టేషన్లు(ఎల్‌డబ్ల్యూ) 17 ఉన్నాయన్నారు. ఎన్నికల బందోబస్తుకు ఐదు కంపెనీల కేంద్ర బలగాలు వచ్చాయని, ఇందులో మూడు బీఎస్ఎఫ్, రెండు సీఆర్‌పీఏ బలగాల్లో 443మంది సాయుధ జవాన్లు బందోబస్తు నిర్వహిస్తున్నారన్నారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి పెట్టామని, పొరుగు రాష్ట్రాల పోలీస్ అధికారులతో సమన్వయం చేసుకుంటున్నామన్నారు. ఎన్నికల సందర్భంగా గడ్చిరోలి వైపు నుంచి మావోయిస్టులు చొరబడకుండా 360కమాండో ఫోర్సెస్ ఆపరేషన్‌ను సరిహద్దు రాష్ట్రాల పోలీసులు నిర్వహిస్తున్నారన్నారు. గ్రేహౌండ్స్ టీములతో కూంబింగ్ ఆపరేషన్ కూడా నిర్వహిస్తున్నట్టు సీపీ తెలిపారు. కేంద్ర బలగాలు, మన రాష్ట్రానికి చెందిన ఏఆర్ పోలీసులు, సివిల్ పోలీసులు బందోబస్తులో పాల్గొంటున్నారని, వీరితో పాటు ఛత్తీస్‌గఢ్ నుంచి కూడా సిబ్బంది బందోబస్తుకు వచ్చారన్నారు. పోలీస్ బలగాలతో పాటు సింగరేణి సెక్యూరిటీ, ఎన్‌సీసీ సేవలను కూడా వినియోగించుకోనున్నట్టు ఆయన పేర్కొన్నారు. ఎన్నికల సందర్భంగా 144సెక్షన్ విధించామని, కమిషనరేట్ పరిధిలో హోంగార్డు నుంచి కమిషనర్ వరకు రాత్రి పగలు పెట్రోలింగ్‌లోనే ఉంటారన్నారు. ఎన్నికల సందర్భంగా పెట్రోలింగ్ పార్టీలు, క్విక్ రియాక్షన్ టీములు, స్ట్రైకింగ్ ఫోర్స్, స్పెషల్ స్ట్రైకింగ్ ఫోర్సులతో పాటు అడిషనల్ డీసీపీ, తన వద్ద ప్రత్యేక టీములు ఉంటాయన్నారు. అత్యవసర సమయాల్లో అక్కడికి చేరుకునేలా ఏర్పాట్లు చేశామన్నారు. ఎన్నికల సందర్భంగా 85 ఆయుధ లైసెన్స్‌లకు గాను 51లైసెన్స్ ఆయుధాలను డిపాజిట్ చేయించామని, బ్యాంకు సెక్యూరిటీ సిబ్బందికి మాత్రం మినహాయింపు ఇచ్చామన్నారు.

● 1,973మంది పోస్టల్ బ్యాలెట్ వినియోగం

పెద్దపల్లి నియోజకవర్గంలో 2,136పోస్టల్ బ్యాలెట్‌కు గాను



గోదావరిఖనిలో మాట్లాడుతున్న సీపీ శ్రీనివాస్

1973మంది(92.3శాతం) పోస్టల్ బ్యాలెట్‌ను వినియోగించుకున్నారని, మిగతా వారు సాంకేతిక కారణాలతో వినియోగించుకోలేకపోయారన్నారు.

● రూ. 1.79కోట్ల నగదు స్వాధీనం

ఎన్నికల సందర్భంగా తనిఖీల్లో రూ.1,79,23,892 నగదును స్వాధీనం చేసుకున్నామని, రూ.81.02లక్షల విలువ గల బంగారం, వెండిని సీజ్ చేశామన్నారు. వీటితో పాటు 11.21కిలోల గంజాయి, 2845లీటర్ల మద్యాన్ని కూడా సీజ్ చేశామని తెలిపారు. కేంద్ర పరిశీలకులు రామగుండం కమిషనరేట్ సిబ్బంది సేవలను అభినందించినట్టు సీపీ తెలిపారు.

● ఎన్నికల బహిష్కరణకు అవకాశం లేదు...

రామగుండం కమిషనరేట్ పరిధిలోని చెన్నూర్ సెగ్మెంట్‌లో ఒక గ్రామంలో ఎన్నికలు బహిష్కరిస్తున్నారనే ప్రచారం వాస్తవం కాదని, ఏమైనా సమస్య ఉంటే ప్రభుత్వ అధికారుల దృష్టికి తీసుకువస్తే పరిష్కరిస్తామన్నారు. కావాలని ఎన్నికల ప్రక్రియకు విఘాతం కలిగిస్తే సహించేది లేదన్నారు. ప్రజలు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో అడిషనల్ డీసీపీ(అడ్మిన్) సీ రాజు, ఎస్‌బీ ఏసీపీ రాఘవేంద్రరావు, ఏఆర్ ఏసీపీలు ప్రతాప్, సురేంద్ర పాల్గొన్నారు.

పోలీసులు, సిబ్బందితో సీపీ సమావేశం..

పెద్దపల్లిటౌన్: ప్రజలు ప్రశాంత వాతవరణంలో ఓటు హక్కు వినయోగించుకునేలా చర్యలు తీసుకున్నట్లు రామగుండం సీపీ ఎం శ్రీనివాస్ తెలిపారు. పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మే 13న జరగనున్న పోలింగ్ నేపథ్యంలో ఈవీఎంల తరలింపు, పోలింగ్ కేంద్రాల వద్ద, పోలింగ్ అనంతరం ఈవీఎంలు స్ట్రాంగ్ రూమ్‌కు చేరే వరకు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు అధికారులు, సిబ్బందితో శనివారం జిల్లా కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పోలింగ్ బూత్‌ల వద్ద, ఇతర డ్యూటీలు, రూట్ మొబైల్స్ ఇన్‌చార్జి అధికారులకు పలు సూచనలు, ఆదేశాలు జారీ చేశారు. ఎన్నికల నిర్వహణపై చేయవలసిన విధులు, మొబైల్ పార్టీల వద్ద, పోలింగ్ సమయంపై అవగాహన కల్పించారు. అనంతరం సీపీ పార్లమెంట్ ఎన్నికలు ప్రశాంతమైన వాతావరణంలో ఎన్నికల నిర్వహణే ప్రధాన లక్ష్యంగా అధికారులు, సిబ్బంది విధులు నిర్వహించాలని సీపీ సూచించారు. ఎన్నికల విధుల్లో అలసత్వం వహించవద్దని, ఎన్నికల నిర్వహణ ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని సూచించారు. ఏ చిన్న సంఘటన జరగడానికి ఆస్కారం ఉన్నా వెంటనే ఉన్నతాధికా రులకు తెలియజేయాలని సూచించారు. రూట్ మొబైలు అధికారులు డీఆర్సీ సెంటర్‌లో ఈవీఎంలు తీసుకున్నప్పటి నుంచి పోలింగ్ స్టేషన్‌కు వెళ్లే వరకు, పోలింగ్ అనంతరం తిరిగి డీఆర్సీ సెంటర్‌కు చేరేవరకు ఈవీఎంలను వదిలి వెళ్లవద్దన్నారు. పోలింగ్ స్టేషన్ల 100 మీటర్ల పరిధిలో వద్ద ప్రజలు గుమికూడవద్దని సూచించారు. ప్రతి ఒక్క సిబ్బంది వద్ద తాము నిర్వహించే పోలింగ్ స్టేషన్ పరిధిలో వచ్చే ఉన్నతాధికారుల మొబైల్ నంబర్లను ముందుగానే తీసుకోవాలన్నారు. రూట్ మొబైల్స్ వద్ద సిబ్బంది రిసెప్షన్ సెంటర్‌కు వచ్చేంతవరకు అప్రమత్తంగా ఉండాలని పేర్కొన్నారు. ప్రజలు నిర్భయంగా తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు వారికి ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా కృషి చేయాలని సూచించారు. సమస్యాత్మక వ్యక్తుల కదలికలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి ఎన్నికల నిబంధనల ప్రకారం చర్యలు చేపట్టాలని తెలిపారు. మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లోని పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సమావేశంలో పెద్దపెల్లి డీసీపీ చేతన, పెద్దపెల్లి ఏసీపీ జి కృష్ణ, ట్రాఫిక్ ఏసీపీ జాడి నరసింహులు, సీఐలు, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.


పాల్గొన్న పోలీస్ అధికారులు, సిబ్బంది

‘దోస్త్’ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ప్రారంభం

- డిగ్రీలో ప్రవేశాలకు అవకాశం

పెద్దపల్లి రూరల్, మే 11: తెలంగాణలోని డిగ్రీ కళాశాలలో 2024-25 విద్యాసంవత్సరంలో ప్రవేశాల కోరకు దోస్త్ ప్రకటన జారీ చేసింది. శాతవాహన విశ్వవిద్యాలయం పరిధిలో పెద్దపల్లి జిల్లాలో మూడు ప్రభుత్వ కళాశాలలు, సుమారు 11 వరకు ప్రైవేట్ డిగ్రీ కళాశాలల్లో దోస్త్ ద్వారా ప్రవేశాలు కల్పించనున్నారు. డిగ్రీ కళాశాలలో సీట్ల భర్తీ కోసం మే 6 నుంచి రిజిస్ట్రేషన్లు ప్రారంభం కాగా మూడు విడతల్లో ప్రవేశాల ప్రక్రియ కొనసాగనుంది. జూలై 8 నుంచి మొదటి సంవత్సరం తరగతులు ప్రారంభం కానున్నాయి. దోస్త్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొబైల్ నంబర్‌కు వచ్చిన ఓటీపీ ద్వారా చేయాల్సి ఉంటుంది. విద్యార్థుల ఆధార్‌కార్డు, మొబైల్ నంబర్‌కు అనుసంధానమై ఉండాలి. విద్యార్థులు ఇంటర్‌నెట్, మీ సేవా కేంద్రాలు, లేదా స్వయంగా రిజిస్ట్రేషన్ చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నైపుణ్యాలు పెంపొందించే విధంగా నూతన కోర్సులు ప్రవేశపెట్టారు. ఇంజనీరింగ్, ఇతర ప్రొఫెషనల్ కోర్సులకు సమానంగా డిగ్రీల్లో కంప్యూటర్ కాంబినేషన్స్‌తో వివిధ కోర్సులు అందుబాటులో ఉన్నాయి. విద్యార్థులకు డిగ్రీతో ఉద్యోగాలు కల్పించడానికి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అదనపు శిక్షణ తరగతులు ఏర్పాటు చేశారు.

● పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో హెల్ప్ సెంటర్

పెద్దపల్లి మండలంలోని పెద్దకల్వల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జిల్లా స్థాయి దోస్త్ సహాయ కేంద్రం ప్రారంభించారు. దోస్త్ నమోదు ప్రక్రియలో విద్యార్థులకు ఏమైనా సాంకేతిక ఇబ్బదులు కలిగితే కళాశాల సహాయ కేంద్రంలో పరిష్కారం పొందవచ్చు. కళాశాలలోని సతిహాయ కేంద్రంలో



కళాశాలలో ఏర్పాటు చేసిన దోస్త్ హెల్ప్ లైన్ కేంద్రం

విద్యార్థులకు దోస్త్ రిజిస్ట్రేషన్ ప్రక్రియ ఉచితంగా చేయబడుతుంది.

● మూడు దశల్లో సీట్ల కేటాయింపు

డిగ్రీ కళాశాలల్లో ప్రవేశాల కోసం తొలిదశ రిజిస్ట్రేషన్‌లు రూ.200 ఫీజుతో మే 6 నుంచి 25 వరకు అవకాశం ఉంది. మే 15 నుంచి 27 వరకు వెబ్ ఆప్షన్‌లు ఇవ్వాలి. జూన్ 3న దోస్త్ మొదటి దశ సీట్ల కేటాయింపు ఉంటుంది. సీటు పొందిన వారు జూన్ 4 నుంచి 10 వరకు సీటు పొందిన కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ ఇవ్వాలి. రెండోదశ రిజిస్ట్రేషన్ జూన్ 4 నుంచి 13వ తేదీ వరకు నిర్వహిస్తారు. దీనికి రూ.400 రిజిస్ట్రేషన్ ఫీజుగా నిర్ణయించారు. జూన్ 4 నుంచి 14 వరకు వెబ్ ఆప్షన్స్‌కు అవకాశం ఉంటుంది. జూన్ 18న రెండో దశ సీట్లు కేటాయింపు ఉంటుంది. జూన్ 19 నుండి 24 వరకు కళాశాలలో సెల్ఫ్ రిపోర్టింగ్ చేయాలి. మూడో దశ రిజిస్ట్రేషన్‌కు కూడ రూ.400 ఫీజు నిర్ధారించారు. జూన్ 19నుంచి 24 వరకు అవకాశం ఉంది. జూన్ 19 నుండి 26 వరకు వెబ్ ఆప్షన్స్ , జూన్ 29 నుండి జూలై 3 వరకు కళాశాలలో సెల్ఫ్ రిపోర్టు చేయాలి. జూలై 1 నుండి అన్ని కళాశాలల్లో ఓరియంటేషన్ తరగతులు నిర్వహిస్తారు. జూలై 7 నుంచి ప్రథమసంవత్సరం తరగతులు ప్రారంభం అవుతాయి.

● దోస్త్ ప్రక్రియకు కావాల్సిన ధ్రువపత్రాలు

దోస్త్ రిజిస్ట్రేషన్ కోసం పదో తరగతి మెమో, ఇంటర్ రెండో సంవత్సరం హల్ టికెట్ నంబర్ ఉండాలి. కులం, ఆదాయ ధ్రువీకరణ పత్రాలు ఏప్రిల్, 2024లో జారీ చేసినవి ఉండాలి. మూడో తరగతి నుంచి ఇంటర్ వరకు స్టడీ సర్టిఫికేట్స్, ఆధార్ కార్డు, పాస్ పోర్ట్ సైజ్ ఫొటోలు, విద్యార్థుల ఆదార్ కార్డు నంబర్‌కు మొబైల్ నెంబర్ లింక్ అయి ఉండాలి. రిజిస్ట్రేషన్ ప్రక్రియ మొబైల్ నెంబర్‌కు వచ్చిన ఓటీపీ ద్వారా చేయబడుతుంది.

● విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి

- డాక్టర్ లక్ష్మీనర్సయ్య, ప్రిన్సిపాల్, ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పెద్దకల్వల



ఇంటర్మీడియట్ పూర్తయిన విద్యార్థులు దోస్త్ ప్రక్రియను సద్వినియోగం చేసుకోవాలి. డిగ్రీలో చేరే వారికి ఇంజనీరింగ్ కోర్సులతో సమాన ఆదరణ ఉంది. దోస్త్ ద్వారా దరఖాస్తు చేసుకున్న వారు ఏవైనా తప్పిదాలు ఉంటే జిల్లా హెల్ప్‌లైన్ కేంద్రానికి వచ్చి సరిచేసుకోవాలి.

జేఎన్టీయూలో కౌంటింగ్ కేంద్రం పరిశీలన

రామగిరి, మే 11: జేఎన్టీయూ(మంథని) ఇంజనీరింగ్ కళాశాలలోని కౌంటింగ్ కేంద్రాన్ని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ పరిశీలించారు. పెద్దపల్లి పార్లమెంట్ నియోజకవర్గ స్థాయిలోని మంథని, పెద్దపల్లి, రామగుండం, ధర్మపురి అసెంబ్లీ సెగ్మెంట్‌లకు సంబంధించిన కౌంటింగ్ కేంద్రంతో పాటు స్ట్రాంగ్ రూం, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలించారు. కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మంథని అసెంబ్లీ సెగ్మెంట్ డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రాలను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం కళాశాలలోని కమ్యూనిటీ హాల్‌లో అధికారులకు నిర్వహిస్తున్న అవగాహన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఎన్నికల కౌంటింగ్ పూర్తయ్యే వరకు అప్రమత్తంగా ఉండాలని అధికారులకు సూచించారు. ఆయన వెంట తహసీల్దార్ రాంచందర్‌రావు, రామ్మోహన్, వివిధ విభాగాలకు చెందిన అధికారులు ఉన్నారు.

కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ యువజన నాయకుడు

రామగిరి, మే 11: మండలంలోని కల్వచర్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ యువజన నాయకుడు గొట్టెముక్కుల మల్లేష్ మంత్రి శ్రీధర్‌బాబు సమక్షంలో కాంగ్రెస్ పార్టీలో శనివారం చేరారు. ఆయన కాంగ్రెస్ పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఎంపీ వంశీకృష్ణ గెలుపు కోసం కృషి చేయాలని మంత్రి సూచించారు.

అర్హులైన వారందరికీ ఇందిరమ్మ గృహాలు

ధర్మారం, మే 11: గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్న అర్హులందరికీ ఇందిరమ్మ గృహాలు మంజూరవుతాయని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ తెలిపారు. శనివారం ధర్మారం మండలం నందిమేడారంలో కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పెద్దపల్లి ఎంపీగా కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని ఆయన కోరారు. కాగా మండలంలోని కమ్మరీఖాన్‌పేట, పెర్కపల్లి గ్రామాల్లో నాయకులు ప్రచారం చేశారు. ధర్మారంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వీధుల్లో ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గ్యారెంటీల అమలు

ఎలిగేడు, మే 11: కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే ఐదు న్యాయ్ గ్యారెంటీలు అమలు చేస్తామని ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. శనివారం మండలంలోని శివపల్లి ధూళికట్ట, ముప్పిరితోట గ్రామాల్లో కాంగ్రెస్‌పార్టీ పార్లమెంట్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. మహాత్మాగాంధీ ఉపాధిహామీ కూలీలను కలిసి ఈనెల 13న జరగబోయే ఎన్నికల్లో చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. కార్యక్రమలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, దుగ్యాల సంతోష్‌రావు, పెద్దపల్లి దేవరాజ్, బాలసాని పర్శంగౌడ్, పడాల నరేష్‌గౌడ్, పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

సుల్తానాబాద్: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీని భారీ మెజారిటీతో గెలిపించాలని కరీంనగర్ ఉమ్మడి జిల్లా కాంగ్రెస్ కమిటీ మాజీ ఉపాధ్యక్షులు గజభీంకార్ జగన్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. శనివారం ఆయన సుల్తానాబాద్‌లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా జగన్ మాట్లాడుతు నాడు కాకా వెంకటస్వామి పెద్దపల్లి అభివృద్ధిలో కీలకపాత్ర పోషించారన్నారు. గడ్డం వంశీకృష్ణను భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.

పెద్దపల్లిటౌన్: కాంగ్రెస్ పార్టతోనే అభివృద్ధి, సంక్షేమం సాధ్యమవుతుందని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి సయ్యద్ మస్రత్ పేర్కొన్నారు. పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా శనివారం పట్టణంలోని వ్యాపార వాణిజ్య సంస్థలో ప్రచారం చేస్తూ గడ్డం వంశీకృష్ణకు ఓటు వేసి గెలిపించాలని అభ్యరించారు. కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ జడల సురేందర్, ఉనుకొండ శ్రీధర్, సల్మాన్, ఆరీఫ్, భూమయ్య పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీలో చేరికలు


కాంగ్రెస్ కండువా కప్పుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

ఓదెల, మే 11 : మండలంలోని గూడెం గ్రామానికి చెందిన 20 మంది వివిధ పార్టీలకు చెందిన నాయకులు, మాజీ ప్రజాప్రతినిధులు, యువకులు ఎమ్మెల్యే విజయరమణారావు సమక్షంలో కాంగ్రెస్‌లో శనివారం చేరారు. అలాగే మండలంలోని మరో మూడు గ్రామాలకు చెందిన బీఆర్ఎస్ కార్యకర్తలు మూల ప్రేమ్‌సాగర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్‌లో చేరారు. కార్యక్రమంలో పలువురు కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

బీజేపీ అభ్యర్థికి మద్దతుగా ర్యాలీ

జూలపల్లి, మే 11. పార్లమెంట్ ఎన్నికలను పురస్కరించుకుని పెద్దపల్లి బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేకు మద్దతుగా మండల నాయకులు మండల కేంద్రంలో శనివారం బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ మరోసారి నరేంద్రమోదీ ప్రధాని కావాలని, అందుకు ప్రజలు మద్దతుగా నిలవాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ మండల అధ్యక్షుడు కొప్పుల మహేష్, నాయకులు వేల్పుల ఓదెలు, కొమ్మ సతీష్, ఆవుల రాజు, పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఏఐటీయూసీ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ

యైటింక్లయిన్‌కాలనీ, మే 11: సీపీఐ బలపరుస్తున్న పెద్దపల్లి కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణకు మద్దతుగా శనివారం సింగరేణి గుర్తింపు సంఘం ఏఐటీయూసీ శ్రేణులు బైక్ ర్యాలీ నిర్వహించాయి. మోదీ హటావో దేశ్‌కొ బచావో పేరిట ర్యాలీ నిర్వహించారు. పెట్టుబడ దారులకు కొమ్ముకాస్తున్న మోదీని ఓడించాలని నాయకులు పిలుపునిచ్చారు. బైక్ ర్యాలీలో ఎల్ ప్రకాష్, రాజారత్నం, రవీందర్, బుర్ర తిరుపతి, అన్నారావు, శ్యాంసన్, మహేందర్, ఎజ్జ రాజయ్య, శంకర్, ఆయా గనులు, డిపార్ట్‌మెంట్లకు చెందిన నాయకులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ఆధ్వర్యంలో బైక్ ర్యాలీ


బైక్‌ర్యాలీలో పాల్గొన్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్, నాయకులు

గోదావరిఖని, మే 11: పెద్దపల్లి పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలంటూ శనివారం గోదావరిఖని పట్టణంలో భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ ఆధ్వర్యంలో గోదావరిఖనిలోని విఠల్‌నగర్, తిలక్‌నగర్, రమేష్‌నగర్, కళ్యాణ్‌నగర్, లక్ష్మీనగర్, మార్కండేయకాలనీ మీదుగా ఈ ర్యాలీ జరిగింది. ఈ సందర్భంగా రాజ్‌ఠాకూర్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత హామి ఇచ్చిన ఆరు పథకాల్లో ఐదు పథకాలు అమలు చేసిందన్నారు. ఎన్నికల తరువాత రూ.36కోట్లతో లక్ష్మీనగర్‌లో అభివృద్ధి కార్యక్రమాలు మొదలు పెడతామని, రూ.15కోట్లతో స్టేడియంను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ బైక్ ర్యాలీలో మేయర్ బంగి అనీల్ కుమార్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్పొరేటర్లు, కార్యకర్తలు పాల్గొన్నారు.

● **కాల్వ శ్రీరాంపూర్/పెద్దపల్లి రూరల్/జూలపల్లి/యైటింక్లయిన్ కాలనీ:** పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణను గెలిపించాలని కోరుతూ కాల్వశ్రీరాంపూర్, పెద్దపల్లి, జూలపల్లి మండలాల్లో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఓసీపీ-3 సీహెచ్‌పీలో ఐఎన్‌టీయూసీ నాయకులు కార్మికులను కలిసి చేతి గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ఆయా కార్యక్రమాల్లో మాజీ ఎంపీపీ గోపగోని సారయ్యగౌడ్, మండల పార్టీ అధ్యక్షుడు సదయ్య, నాయకులు అల్లం దేవేందర్, మాదాసి సతీష్ అరెల్లి రమేష్, పులి ఇంద్రకరణ్ రెడ్డి, బంగారు రమేష్, రానవేన శ్రీనివాస్, సబ్బని రాజమల్లు, ఆషాడపు సురేష్, ఆర్జీ-2 వైస్ ప్రెసిడెంట్ కొత్త సత్యనారాయణరెడ్డి, నాయకులు ప్రభాకర్‌గౌడ్, మార్కండేయ, నవీన్, ప్రణయ్, మధు, వెంకటేష్, కొంరెల్లి, సాగర్ పాల్గొన్నారు.

మూడో సారి ప్రధానిగా మోదీని గెలిపించుకోవాలి

గోదావరిఖని, మే 11: మూడోసారి ప్రధానిగా నరేంద్ర మోదీని గెలిపించుకోవాలని బీజేపీ ఎస్సీ మోర్చా జాతీయ కార్యదర్శి ఎస్ కుమార్ పిలుపునిచ్చారు. శనివారం బీజేపీ పార్లమెంట్ కో కన్వీనర్ గుండబోయిన లక్ష్మణ్‌యాదవ్ ఆధ్వర్యంలో జనగామ, జీఎం కాలనీ, పవర్‌హౌస్‌కాలనీ, ఉదయ్‌నగర్ ప్రాంతాల్లో గడపగడపకు వెళ్లి బీజేపీ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేను గెలిపించాలని ప్రచారం నిర్వహించారు.

కాల్వ శ్రీరాంపూర్: దేశంలో పది సంవత్సరాల్లో మోదీ నీతివంతమైన పాలన అందించాడని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దుగ్యాల ప్రదీప్‌రావు అన్నారు. శనివారం మండలంలో పెద్దపెల్లి బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి శ్రీనివాస్ గొమాసేకు మద్దతుగా ఓబీసీ మోర్చా రాష్ట్ర కోశాధికారి తాత రవియాదవ్ ఆధ్వర్యంలో దుగ్యాల ప్రదీప్‌రావు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పలు గ్రామాల మీదుగా బైక్ ర్యాలీ నిర్వహించారు. 13న జరిగే పార్లమెంటు ఎన్నికల్లో బీజేపీకి ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శిలారపు పర్వతాలు, బీజేపీ మండల అధ్యక్షుడు చిలువేరు సంపత్ పాల్గొన్నారు.

బీఆర్ఎస్ అభ్యర్థి ‘కొప్పుల’కు మద్దతుగా ప్రచారం

పెద్దపల్లిటౌన్, మే 11: పెద్దపల్లి పార్లమెంటు అభ్యర్థి కొప్పుల ఈశ్వర్ గెలుపు ఖాయని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కేంద్రంలో శనివారం పట్టణ శాఖ అధ్వర్యంలో బైక్ ర్యాలీ నిర్వహించారు.. మనోహర్ రెడ్డి గారి క్యాంప్ కార్యాలయం నుంచి ప్రారంభమైన ర్యాలీ బస్టాండ్, రంగంపల్లి కమాన్ చౌరస్తా, జెండా చౌరస్తా, మజీద్, అయ్యప్ప స్వామి దేవాలయం మీదుగా శాంతినగర్ వరకు కొనసాగింది. దాసరి మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించేందు బీఆర్ఎస్ శ్రేణులు సైనికుల్లా పనిచేయాలన్నారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు తదితరులున్నారు.

ఎలిగేడు: కాంగ్రెస్ పార్టీకి పార్లమెంట్ ఎన్నికల్లో తగిన బుద్ధి చెప్పాలని మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి అన్నారు. శనివారం మండలంలోని సుల్తాన్‌పూర్, ఎలిగేడు, ధూళికట్ట గ్రామాల్లో బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని ఉపాధిహామీ కూలీలను అభ్యర్థించారు. కాంగ్రెస్ మోసపూరిత వాగ్దానాలు చేసి గద్దెనెక్కి ప్రజలకు పెనుభారంగా పరిణమించారన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ తానిపర్తి స్రవంతిమోహన్‌రావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు బైరెడ్డి రాంరెడ్డి, నాయకులు న్యాతరి పోచయ్య, కప్పల ప్రవీణ్, బాసంపల్లి రాజేష్, నర్సిని సుధాకర్‌రావు, తానిపర్తి సంజీవరావు, తీతుకుమార్, వినోద్ పాల్గొన్నారు.

సుల్తానాబాద్: బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేస్తున్న మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్‌ను గెలిపించాలని కోరుతూ మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి సుద్దాల, కనుకుల గ్రామంలో ప్రచారం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ బాలాజీరావు, కాసర్ల అనంతరెడ్డి, మైలారం నారాయణ, గరిగంటి కుమార్,కర్రె కుమార్,వాసు, ఎల్లస్వామి, రాజేశం, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు

జూలపల్లి: మండలంలోని పెద్దాపూర్‌లో ఎన్నికల ప్రచారంలో భాగంగా శనివారం ఐకేపీ కొనుగోలు కేంద్రంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. పెద్దపల్లి బీఆర్ఎస్ పార్టీ ఎంపీ అభ్యర్థి కొప్పుల ఈశ్వర్‌కు ఓటేసి గెలిపించాలని కోరారు. అనంతరం ఐకేపీ కేంద్రంలో పనిచేస్తున్న హమాలీకు, రైతులకు మజ్జిగ ప్యాకెట్లను అందజేశారు. బీఆర్ఎస్ పార్టీ నాయకులు సంకెండ్ల లక్ష్మీనర్సయ్య, కల్లెపెల్లి లింగయ్య, కంకనాల వెంకటేష్, తొగరి నరేష్, నల్లాల నరేష్, ఉమెందర్, చంద్రయ్య, సతీష్ పలువురు పాల్గొన్నారు.

గ్రామాల్లో పార్టీల ప్రచారం

ఓదెల, మే 11 : మండలంలోని గ్రామాల్లో శనివారం వివిధ పార్టీల నాయకులు యుద్ద ప్రతిపాదికన ప్రచారాలు నిర్వహించారు. కాంగ్రెస్ నేతలు వంశీ కృష్ణ ను గెలిపించాలని కోరగా, బీజేపీ నాయకులు కొలనూర్ నుంచి బైక్ ర్యాలీతో ప్రచారాన్ని కొనసాగించారు. అలాగే బీఆర్ఎస్ అభ్యర్థి ఈశ్వర్ గెలుపు కోసం మాజీ ప్రజాప్రతినిధులు మాత్రమే ఉపాధి కూలీల వద్దకు, ఐకేపీ కేంద్రాల్లో ప్రచారం నిర్వహిస్తూ కొప్పుల ఈశ్వర్ ను గెలిపించాలని కోరారు.

కాంగ్రెస్ సేవాదళ్ ఆధ్వర్యంలో ప్రచారం

ధర్మారం, మే 11: పెద్దపల్లి ఎంపీ కాంగ్రెస్ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గెలుపు కోసం శనివారం కాంగ్రెస్ సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు బొల్లి స్వామి ఆధ్వర్యంలో ఎన్నికల ప్రచారం చేశారు. అట్టడుగు బలహీన వర్గాల అభ్యున్నతికి కాంగ్రెస్ పార్టీ అండగా ఉంటుందని ఈ సందర్భంగా ఆయన చెప్పారు. ఎంపీగా వంశీకృష్ణను గెలిపించాలని ఆయన కోరారు.

ఆంధ్రజ్యోతి CLASSIFIEDS

ఇల్లు అమ్మబడును

★ కరీంనగర్ తీగలగుట్టపల్లి గవర్నమెంట్ స్కూల్ ఎదురుగా నిగమ హోమ్స్ విజేత గ్రీన్ సిటీ గేటెడ్ కమ్యూనిటీలో నార్త్ ఫేస్‌తో 2 సైడ్ రోడ్ గల ఇండిపెండెంట్ డూప్లెక్స్ హౌజ్ విల్లా నెం. 4 అమ్మబడును. సంప్ర: సెల్ : 98485 54363
AJK-185913

ఆయుర్వేదము

★ కరీంనగర్ జిల్లా ప్రజలారా మీ మెడ, (సర్వైకల్), నడుము, మోకాళ్ళ నొప్పులకు ఎలాంటి సైడ్ ఎఫెక్ట్ లేని ఆయుర్వేద మందులు లభించును. సంప్ర : సెల్ : 83282 68567
AJK-185914

కమర్షియల్ షటర్ అద్దెకు

★ కరీంనగర్ బోయవాడలో హనుమాన్ గుడి దగ్గర అమృత రెసిడెన్సీ ఫస్ట్‌ఫ్లోర్‌లో కమర్షియల్ షటర్ అద్దెకు ఇవ్వబడును. సెల్ : 98496 48550
AJK-15414

PLOTS FOR SALE

★ KUDA Layout Plots for Sale & Independent Houses for Sale. Near KITS College, Erragattu Gutta, Ambala Road, Contact : Srikanth : 7013397258, 8328168015
AJW-188086

PLOTS FOR SALE

★ KUDA Layout Plots for Sale & Independent Houses for Sale. Near Gorrekunta, Potharajpally, Warangal, Contact : Srikanth : 7013397258, 8328168015
AJW-188085

TO-LET

కరీంనగర్‌లోని కలెక్టర్ ఆఫీస్ రోడ్‌లో HDFC బ్యాంక్ ప్రక్కన 1250Sq.Fts N/E ఫేసింగ్ 1st Floor లో గల 4 షటర్స్ షాప్స్, ఆఫీసులకు, కమర్షియల్ కొరకు అద్దెకు ఇవ్వబడును. సెల్ : 99497 57675
AJK-185909

CHANGE OF NAME

★ I, RAJANI REDDY MUTHYALA (Old Name) H.No. 1-121, Akunur, Saidapur, Karimnagar, T.S. have changed my name from RAJANI REDDY MUTHYALA to RAJANI MUTHYALA (New Name), W/o. SANJEEVA REDDY MUTHYALA in all my Records
AJW-188091

పాఠకులకు ముఖ్య గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో నిజానిజాలు క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు ప్రకటించిన లేదా ప్రచురించిన క్లెయిమ్‌లతో ఆంధ్రజ్యోతి సంస్థకు ఏ విధమైన సంబంధంలేదు. ప్రకటనలకు సంబంధించి పాఠకులు బ్యాంక్ అకౌంట్ల ద్వారా / ఇతరత్రా నమ్మించబడిన / క్లెయిమ్స్‌కు, చట్ట వ్యతిరేక మోసాలకు ప్రకటనదారునితో జరుపబడు లావాదేవీలకు ఆంధ్రజ్యోతి సంస్థ/ యాజమాన్యం ఎటువంటి బాధ్యత వహించదు.
పాఠకులు ఈ విషయాన్ని ముఖ్యంగా గమనించగలరు.
మేనేజర్ - ఏడివిటి

ఆంధ్రజ్యోతిలో క్లాసిఫైడ్ ప్రకటనలకై సంప్రదించండి
కరీంనగర్ :- సెల్ : 99854 10640
జగిత్యాల :- సెల్: 99854 11262
మెట్‌పల్లి :- సెల్: 70131 42966
వేములవాడ, సిరిసిల్ల :- సెల్: 99854 11063
పెద్దపల్లి :- 95509 00238